క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోడూరు: మండలంలోని విశ్వనాథపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం విద్యుత్ కోత విధించనున్నట్లు ఆ శాఖ ఈఈ కృష్ణనాయక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 33 కేవీ విద్యుత్ లైన్, పిట్టల్లంక రూరల్ ఫీడర్, ఎక్స్‌ప్రెస్ ఫీడర్, సాలెంపాలెం, పిట్టల్లంక పంచాయతీల్లోని ఆక్వా చెరువులు, గృహాలకు వెళ్లే విద్యుత్ లైన్లకు సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని ఈఈ తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



కోడూరు: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ చాణిక్య అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని వి.కొత్తపాలెం గ్రామంలో సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్‌లు వస్తే జాగ్రత్త వహించాలన్నారు. ఓటీపీలు, ఆధార్, బ్యాంకు ఖాతాలను చెప్పవద్దని ఎస్ఐ సూచించారు. సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు పేరుతో కొత్త తరహా దోపిడీకి పాల్పడుతున్నారని, వీటిపై విద్యార్థులు, ఉద్యోగులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పిల్లలను డ్రగ్స్‌కు దూరంగా ఉంచడంతో పాటు మైనర్లకు ద్విచక్రవాహనాలను ఇవ్వవద్దని ఎస్ఐ పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు. సిబ్బంది పాల్గొన్నారు.

బోనస్ పంపిణీ

నాగాయలంక: స్థానిక పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో 121 మంది సభ్యులకు సంఘ అధ్యక్షుడు తలశిల బాబూరావు చేతుల మీదుగా మంగళవారం బోనస్ పంపిణీ చేశారు. గత ఆగస్టు 1వ తేదీ నుంచి నవంబరు 30వ తేదీ వరకు నాలుగు నెలల కాలానికి 0.10 పైసలు చొప్పున 121 మందికి నగదు రూ.83,260 మొత్తం అందజేశారు. ఈ సమయంలో కేంద్రానికి ఎక్కువ పాలు పోసిన తలశిల వీరేంద్ర అత్యధికంగా రూ.7,763 బోనస్ పొందారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బాబూరావు మాట్లాడుతూ పాడి రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఎంపీఓ మోర్ల వరప్రసాద్, సంఘం డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి వితరణ

కృత్తివెన్ను: మండల పరిధిలోని చినగొల్లపాలెం పంచాయతీ రాళ్లరేవు ఉన్నత పాఠశాలలో క్రీడలకు అవసరమైన సామగ్రిని దాతలు అందజేశారు. మాజీ ఎంపీటీసీ రేవు సాంబశివరావు తన తమ్ముడు రేవు వీరకుమార్ జ్ఞాపకార్థం మంగళవారం ప్రధానోపాధ్యాయుడు చంద్రమోహన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి ఆటల పోటీల్లో మంచి ప్రతిభ చూపుతున్నారని, ఇదే విధంగా వారు రాష్ట్ర స్థాయిలో కూడా మంచి ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. ఇందుకోసం ప్రోత్సాహకంగా తన వంతు సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ మురళీకృష్ణ, పీడీ నాగరాజు, సీఆర్‌పీ దినేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

బంటుమిల్లి: మండల పరిధిలోని జానకీరామపురం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద మంగళవారం రాత్రి నిర్వహించిన మురళీ కోలాటం భక్తులను ఆకట్టుకుంది. సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు సీలిపూడి గ్రామానికి చెందిన మురళీ కోలాట బృందం సభ్యులు, శ్రీను గురువు నేతృత్వంలో చేసిన నృత్య ప్రదర్శన, పాడిన పాటలు భక్తుల మనస్సులు రంజింప చేశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ దేవానంద్, పుప్పాల రంగారావు, పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

బంటుమిల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టరు ఎస్.జగన్మోహన్‌రావు పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.జయరాజు, పాస్టరు సాయిబాబులు క్రీస్తు సందేశాలిచ్చారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అన్నపై కత్తితో దాడిచేసిన తమ్ముడు

గూడూరు: ఆస్తి తగాదాల నేపథ్యంలో అన్నపై కత్తితో తమ్ముడు దాడి చేసిన ఘటన మండలంలోని లేళ్లగరువులో చోటు చేసుకుంది. స్థానికులు వెల్లడించిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కుంభం లక్ష్మయ్యకు అతని సోదరుడు రేణుకారావుకు గత కొంత కాలంగా ఆస్తి తగాదాలు ఉన్నాయి. గతంలో ఇద్దరి మధ్య కొట్లాటలు జరగ్గా కేసు ప్రస్తుతం కోర్టులో నడుస్తోంది. అయితే మంగళవారం సాయంత్రం ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఘర్షణలో రేణుకారావు కత్తితో దాడి చేయ బోగా ఇంట్లోకి పరుగెత్తిన లక్ష్మయ్యను వెంబడించి మరీ దాడికి పాల్పడ్డాడు. దాడిలో లక్ష్మయ్య తలకు బలమైన గాయమవగా 108లో బందరు ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రేణుకారావు పరారీలో ఉన్నాడు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మా ఇష్టం..తవ్వేస్తాం..

- ఇష్టారాజ్యంగా సీసీ రోడ్ల తవ్వకాలు
- నిబంధనలకు విరుద్ధంగా డ్రెయిన్‌ల ఏర్పాటు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని మున్సిపాలిటీ అధికారులు



ఓ ప్రైవేటు కల్యాణ మండపం వద్ద సిమెంట్ రోడ్డును తవ్వివదిలేసిన దృశ్యం

మచిలీపట్నంటౌన్: నగరంలో లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన సిమెంట్ రోడ్లను అడ్డగోలుగా తవ్వేస్తున్నారు. అపార్టుమెంట్‌లు, కల్యాణ మండపాలు, గృహాల యజమానులు వారిసొంత అవసరాలకు రోడ్లను ఇష్టాను సారంగా ధ్వంసం చేస్తున్నారు. ధ్వంసం చేసిన రోడ్లకు సరైన మరమ్మతులు చేయకుండా వదిలేస్తుండటంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పటం లేదు. దీనిపై నగరపాలక సంస్థ అధికారుల్లో చలనం లేకుండా పోయింది. ప్రలోభాలకు లోనైనందునే రోడ్లను అడ్డగోలుగా ధ్వంసం చేస్తున్నా పట్టించుకోవటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎక్కడెక్కడంటే..

తాజాగా జిల్లా కోర్టు రోడ్‌లోని నాలుగు రోడ్ల కూడలి వద్ద ఉన్న ఓ ప్రైవేటు కల్యాణ మండపం వారు వారి సొంత డ్రెయిన్‌కు తూములు ఏర్పాటు చేసుకునేందుకు 10 రోజుల క్రితం రోడ్డును పగులగొట్టారు. రద్దీగా ఉండే ఈ రోడ్డును పగులగొట్టి రోజులు గడుస్తోంది. రోడ్డును పూడ్చకపోవటంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇదే రోడ్డులో ఇన్‌డోర్ స్టేడియం వద్ద కూడా రోడ్డును పగులగొట్టారు. ఈడేపల్లి వినాయకుని గుడి ముందు ఓ అపార్టుమెంట్ యజమాని డ్రెయిన్ కోసం ప్రధాన సిమెంట్ రోడ్డును ఇష్టానుసారంగా పగులగొట్టారు. దీనిని ఇప్పటికీ సక్రమంగా పూడ్చకపోవటంతో రాకపోకలకు వాహనదారులు ఇక్కట్లకు గురవుతున్నారు.

నిబంధనలు ఇవీ..

నగరపాలక సంస్థ పరిధిలో ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవటంతో నానాటికీ ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వ ఆస్తులను అవసరాల కోసం వినియోగించాలన్నా, ధ్వంసం చేయాలన్నా నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులను సంప్రదించాలి. దీనికి సంబంధించి రోడ్ కటింగ్ చార్జీలను ఇంజినీర్లు నిర్ధారిస్తారు. ఈ మొత్తాన్ని చెల్లిస్తే వారు అనుమతులు ఇచ్చిన తర్వాతనే పనులు ప్రారంభించాలి. మున్సిపాలిటీ రోడ్లపై ఇసుక, కంకర, ఇతర నిల్వలు ఉంచాలన్నా అనుమతి తీసుకోవాల్సిందే.

కారణం ఇదీ..

కానీ నగరంలో మాత్రం మమ్మల్ని ఎవడ్రా.. ఆపేది అన్న చందంగా ఆ ప్రాంత టీడీపీ ఇన్‌చార్జ్ ప్రోద్బలంతో కల్యాణ మండప యజమాని డ్రెయిన్ పైప్‌లు ఏర్పాటు చేయటం గమనార్హం. రోడ్లను పగులగొట్టి డ్రెయిన్‌ల కోసం పైప్‌లను ఏర్పాటు చేయటంతో పాటు ప్రభుత్వ డ్రెయిన్‌లలో పేరుకుపోయిన చెత్తను తొలగించే వీలు లేకుండా శ్లాబులు ఏర్పాటు చేస్తూ మురుగునీటి పారుదలకు అడ్డంకులు ఏర్పరుస్తున్నా చర్యలు శూన్యం. దీంతో ప్రతి ఒక్కరూ అనుమతులతో పని లేకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

స్పందించాలి..

నగరపాలక సంస్థ అధికారులు ఇప్పటికైనా స్పందించి ఇలాంటి వారిని చట్టపరంగా శిక్షించాలని, పెద్ద ఎత్తున అపరాధ రుసుం వసూలు చేయాలని కోరుతున్నారు.

నిబంధనలు పాటిస్తాం..

ఇకపై అనుమతులు లేకుండా రోడ్లను తవ్వేవారిపై చర్యలు తీసుకుంటాం. నిబంధనల ప్రకారం వ్యవహరిస్తాం. మరమ్మతుల కోసం ఈ రోడ్డును తవ్వించాం. అయితే ఈ రోడ్డు తవ్వటంతో అక్కడి కల్యాణ మండపం యజమాని డ్రెయిన్ కోసం పైపులు ఏర్పాటు చేశాడు. మంగళవారం సాయంత్రం పైప్‌లను తొలగించి రోడ్డు గొయ్యను పడ్చాం. ఆక ముందు నిబంధనలు పాటిస్తాం.

– రాజేశ్వరరావు, ఏఈ, మచిలీపట్నం

రెవెన్యూ సదస్సులతో రైతులకు మేలు



చోడవరం సదస్సులో రైతుతో మాట్లాడుతున్న తహసీల్దార్ హరనాథ్



బలిపర్రులో అర్జీని పరిశీలిస్తున్న తహసీల్దారు అనిల్‌కుమార్ తదితరులు

చోడవరం(నాగాయలంక): మండలంలోని చోడవరం పంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో 14 అర్జీలు వచ్చినట్లు స్థానిక తహసీల్దార్ ఎం.హరనాథ్ చెప్పారు. ఆయన మాట్లాడుతూ రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ కైతేపల్లి రాజేంద్ర, ఎంపీడీఓ జె.సీతారామ్‌కుమార్, డీటీ అబ్దుల్ రఫీ, ఈఓపీఆర్డీ కె.అప్పల నరసమ్మ, వీఆర్‌ఓఅజయ్ పాల్గొన్నారు.

పెడన: మండల పరిధిలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులలో 34 దరఖాస్తులు వచ్చినట్లు ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ తెలిపారు. కాకర్లమూడిలో ఉదయం జరిగిన సదస్సులో 23, మధ్యాహ్నం నుంచి బలిపర్రు, శింగరాయాలపాలెం గ్రామాల్లో నిర్వహించిన సదస్సులో 11 దరఖాస్తులు వచ్చాయన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాల్లో తప్పులున్నాయని, రిసర్వేలో భూమి తగ్గిందనేటువంటి అర్జీలు ఇచ్చారన్నారు. ప్రత్యేక అధికారిణి, డీఎల్‌డీవో పద్మావతి, ఎన్నికల విభాగం ఆర్ఐ నరసింహారావు, ఆర్ఐ విజయలక్ష్మి, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కోడూరు: మండలంలోని విశ్వనాథపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వివిధ భూ సమస్యలపై 28 అర్జీలు స్వీకరించారు. భూ సమస్యలను పరిష్కరించేందుకు ఈ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనునాయక్ చెప్పారు. సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అడంగల్ సవరణ, పట్టాదార్ పాస్‌పుస్తకాలు, భూముల సర్వేకు సంబంధించి 28 అర్జీలు రైతులు అందించినట్లు తహసీల్దార్ తెలిపారు. ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, డీటీ పద్మప్రియ, ఆర్ఐ సుభాషిణి, వీఆర్వో గోపాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

కె కొత్తపాలెం(మోపిదేవి): మండలంలోని కె కొత్తపాలెం గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి అధ్యక్షతన మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. స్థానిక శ్రీవేణుగోపాల స్వామి దేవస్థానానికి సంబంధించిన పంట పొలాల సమస్యను మండల కోఆప్షన్ సభ్యుడు చందన రంగారావు సదస్సు దృష్టికి తీసుకొచ్చారు. సంవత్సరానికి రూ.లక్షకు పైగా ఆదాయం వచ్చే భూమికి కేవలం రూ. 50 వేలకు మాత్రమే కౌలు రావడం వలన దేవస్థానం ఆదాయం కోల్పోతుందన్నారు. మరో రైతు మత్తి వరప్రసాద్ తన పంట భూమిలో 40 సెంట్లు ఈ- క్రాప్ కావడం లేదన్నారు. తహసీల్దార్ శ్రీవిద్య మాట్లాడుతూ గ్రామంలో పలు సమస్యలపై ఏడు అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. మండల సర్వేయర్ రామకృష్ణబాబు, దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి జోగి ప్రవీణ, ఇన్‌చార్జి ఆర్ఐ మోపిదేవి శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరరావు, దేవదాయశాఖ సిబ్బంది విష్ణుబట్ల రమణ, గ్రామ సచివాలయ సర్వేయర్ సరత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గూడూరు: రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు డి.రాజ్యలక్ష్మి తెలిపారు. మంగళవారం గూడూరు, చిట్టిగూడూరు గ్రామాల్లో సదస్సులు నిర్వహించి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. సదస్సులో 30 అర్జీలు వచ్చాయని, వాటిపై విచారణ జరిపి పరిష్కరిస్తామన్నారు. మాజీ డీసీ చైర్మన్ పోతన స్వామి, మాజీ సర్పంచ్ పోతన రామోజీ, ఆర్ఐ టి.రాధ, నాయకులు కోడే వెంకటేశ్వరరావు, తోట వేణు, వీఆర్వోలు పాల్గొన్నారు.

మాజీ నక్సలైట్ సింహాద్రి కృష్ణారావు కన్నుమూత

నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే సింహాద్రి



సింహాద్రి కృష్ణారావు (ఫైల్)

అవనిగడ్డ: మండల పరిధిలోని బందలాయిచెరువుకు చెందిన మాజీ నక్సలైట్ సింహాద్రి కృష్ణారావు (85) మంగళవారం మరణించారు. సుదీర్ఘకాలం నక్సలైట్‌గా పనిచేసిన ఆయన జీవితకాలం జైలుశిక్ష అనుభవించారు. అనంతరం బందలాయిచెరువులోనే ఉంటున్న ఆయన రైతుకూలీ సంఘం, విరసం, పలు ప్రజాసంఘాల్లో చురుగ్గా పనిచేశారు. జైల్లో కిట్టారావుగా పేరొందిన ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉండగా పెద్ద కుమారుడు మూడేళ్ల క్రితం గుండెపోటుతో మరణించాడు. ఆయన భౌతిక దేహంపై ఎర్రజెండా కప్పి జోహార్లు అర్పించారు. అమర్‌రహే నినాదాలతో బందలాయిచెరువు శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, విరసనం నేత రవీర, కేఎన్‌పీఎస్ నాయకులు చిన్నా, సీపీఎం నాయకులు శీలం నారాయణరావు, ఆవుల బసవయ్య, తమ్మా రత్తయ్య, లిబరేషన్ నాయకులు మారుబోయిన పులేంద్రరావు, బందారు వెంకటేశ్వరరావు, పీడీఎం నాయకులు క్రాంతి, డీటీఎఫ్ నాయకురాలు భానుమతి, సీనియర్ న్యాయవాది పర్చూరి రాఘవేంద్రరావు తదితరులు కృష్ణారావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

శ్మశానవాటికలో కంప తొలగింపు



ఉత్తరచిరువోలులంకలో జంగిల్ క్లియరెన్స్ చేయిస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): మండలంలోని ఉత్తరచిరువోలులంక గ్రామ శ్మశానవాటికలో పంచాయతీ నిధులతో జంగిల్ క్లియరన్స్ చేపట్టినట్లు గ్రామ సర్పంచ్ చింతా శ్రీనివాసరావు, కార్యదర్శి షహానా తెలిపారు. శ్మశానవాటికతో పాటు ఆర్సీ కరకట్ట నుంచి శ్మశానవాటికవరకు రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్లకంపను, పిచ్చిమొక్కలను జేసీబీ సాయంతో తొలగించినట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్మశానవాటికలోని కర్మకాండలు చేసుకునే షెడ్డు ఇటీవల కృష్ణానదికి వచ్చిన వరదల్లో కుప్పకూలిపోయిందని, ఆ షెడ్డును పునఃనిర్మించినట్లు తెలిపారు. ప్రజల సౌకర్యార్థం నదిలోకి దిగడానికి జేసీబీతో బాట ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ వివరించారు.

వరికోతలు వాయిదా వేయాలి

అవనిగడ్డ: వర్షాభావ పరిస్థితులు ఉన్నందున వరికోతలు వాయిదా వేసుకోవాలని ఏడీఏ జయప్రద తెలిపారు. అవనిగడ్డలో మంగళవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ అల్పపీడనం నేపథ్యంలో ఈనెల 12 వరకూ వర్షాలు పడవచ్చని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో ఈ రెండు రోజులు వరికోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు. ఏవో శౌరమ్మతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన

అవనిగడ్డ: అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మానవహక్కులపై మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది మత్తి వెంకటేశ్వరరావు మానవహక్కుల గురించి విద్యార్థులకు వివరించారు. మానవ హక్కుల ఉల్లంఘన జరిగినపుడు ఎవరిని ఆశ్రయించాలి, న్యాయం జరిగేందుకు ఉన్న చట్టాలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ అన్నపరెడ్డి శ్రీనివాసరావు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

హత్యలు, లైంగిక వేధింపులను అరికట్టాలి

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం

మచిలీపట్నంటౌన్: బాలికలు, మహిళలపై జరుగుతున్న హింస, అత్యాచార, లైంగిక వేధింపులను ప్రభుత్వాలు తక్షణమే అరికట్టాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) మచిలీపట్నం నగర శాఖ కార్యదర్శి కొడాలి సుజాత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుట్టాయిపేటలోని జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో మంగళవారం మహిళలపై హింస, బాలికలపై లైంగిక వేధింపులను నిరోధించాలని కోరుతూ ఐద్వా మచిలీపట్నం నగర కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సుజాత మాట్లాడుతూ ప్రతి రోజూ మహిళలపై వెయ్యికి పైగా నేరాలు జరుగుతున్నాయని జాతీయ ఆరోగ్య సర్వే లెక్కలు చెబుతున్నాయన్నారు. రోజుకు 93 మంది మహిళలు రేప్‌కు గురవుతున్నారని, వీరిలో మూడో వంతు మైనర్ బాలికలు ఉంటున్నారన్నారు. మహిళలకు సమాన భాగస్వామ్యం, న్యాయం, భద్రత ప్రభుత్వ పరంగా అందాలని ఆమె కోరారు. ఐద్వా నగర అధ్యక్షురాలు విజయ లక్ష్మి అధ్యక్షత వహించగా కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ రాజేష్, సీపీఎం సీనియర్ నాయకుడు కొడాలి శర్మ, సీఐటీయూ జిల్లా కోశాధికారి బూర సుబ్రహ్మణ్యం, జిల్లా నాయకులు టీ చంద్రపాల్, ఎన్‌పీఆర్‌డీ జిల్లా కార్యదర్శి ఎన్‌ఎస్ నారాయణ, సీఐటీయూ నగర కార్యదర్శి జయరావు, ఐద్వా నాయకులు టి.చాందినిదుర్గ, సీహెచ్ అరుణ కుమారి, ఎం పద్మావతి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

మచిలీపట్నంటౌన్: క్షయవ్యాధితో బాధపడుతున్న బాధితుల పిల్లల విద్యా అవసరాల కోసం తెనాలి డబుల్ హార్స్ సంస్థ అందించిన ఆర్థిక సాయాన్ని మంగళవారం విద్యార్థులకు అందజేశారు. స్థానిక మల్కాపట్నంలోని జిల్లా క్షయ నివారణ కేంద్ర వద్ద రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని జిల్లా క్షయ నియంత్రాధికారి అంబటి వెంకట్రావు పది మంది విద్యార్థులకు రూ. లక్షను అందజేశారు. లెప్రా సొసైటీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వెంకట్రావు మాట్లాడుతూ లెప్రా సంస్థ తెనాలి డబుల్ హార్స్ సంస్థతో కలిసి జిల్లాలో కుష్ఠు, క్షయ వ్యాధుల నివారణకు పని చేస్తుండటం అభినందనీయమన్నారు. విద్యార్థుల ఉన్నత చదువుల కోసం డబుల్ హార్స్ సంస్థ ఈ సహాయాన్ని అందించటం అభినందనీయమన్నారు. లెప్రా సొసైటీ రాష్ట్ర కోఆర్డినేటర్ రాధిక, డీఎంఎన్‌ఓ డాక్టర్ వేణుగోపాలరావు, లెప్రా సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాలను జయప్రదం చేద్దాం

పెడన: పట్టణంలోని శ్రీ పైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను జయప్రదం చేద్దామని ఈఓ టి.మోహన్‌రావు అన్నారు. మంగళవారం ఆలయ ఆవరణలో నిర్వహించిన ఉత్సవ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా నడుచుకుని ఆలయ సిబ్బందితో సమన్వయం చేసుకుని విజయవంతం చేయడానికి కృషి చేయాలన్నారు. ఈఓ సభ్యులతో సమీక్షించారు. కమిటీ సభ్యులు ఆసాది తోట వెంకటరామారావు పాల్గొన్నారు.

కేవీకేను సందర్శించిన యూబీ పీఓలు

ఘంటసాల: గ్రామీణ ప్రాంతాల అవగాహన కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం యూనియన్ బ్యాంకు ప్రొబేషనరీ ఆఫీసర్లు స్థానిక కృషి విజ్ఞాన కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి కృషి విజ్ఞాన కేంద్రం విధులు, పనితీరు, కేంద్రంలో వరి, మినుము విత్తన ఉత్పత్తుల గురించి వివరించారు. వ్యవసాయ విస్తరణ విభాగ శాస్త్రవేత్త డాక్టర్ నవీన్ శిక్షణా కార్యక్రమాలు, క్షేత్రస్థాయి పరిశోధనలు తెలిపారు. ఉద్యాన విభాగ షేడ్ నెట్‌లో మొక్కల పెంపకం, వరి రకాలు, న్యూట్రి గార్డెన్, కోళ్లు, మేకలు, పాడి పశువులు, కొరమేను చేపల పెంపకం, చూపిస్తూ నవీన్ వివరణ ఇచ్చారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటలక్ష్మి, మంజువాణి, రేవతి, కృష్ణవేణి, యశ్వంత్, విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు ఉప్పాల పరామర్శ



బందరు ప్రభుత్వాసుపత్రిలో కూలీలను పరామర్శిస్తున్న ఉప్పాల రాము

గూడూరు: పామర్రు మండలం కురుమద్దాలి దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మల్లవోలు గరువుకు చెందిన వ్యవసాయ కూలీను వైఎస్సార్ సీపీ పెడన ఇన్‌చార్జి ఉప్పాల రాము పరామర్శించారు. మంగళవారం బందరు ప్రభుత్వాసుపత్రికి వెళ్లిన రాము అక్కడ చికిత్స పొందుతున్న బాధితుల పరామర్శించారు. ప్రమాద తీరును అడిగి తెలుసుకున్నారు. వైద్యం మంచిగా అందుతుందా లేదా అని ఆరా తీశారు. బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఆసుపత్రి వైద్యులతో మాట్లాడిన రాము క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఆయన వెంట గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, మండల పార్టీ అధ్యక్షుడు పర్ణం మహాలక్ష్మయ్యనాయుడు, గొరిపర్తి రవికుమార్, కారుమంచి కామేశ్వరరావు, సర్పంచ్ బొర్రా సాంబయ్య, మెట్ల రఘు, పిట్ల రామిరెడ్డి, పిండి వెంకన్న, ఐనాల శ్రీను, జంపాన అవినాష్, జక్కా రాజేష్, కంచర్ల నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు



మృతుని భార్య దుర్గాభవానికి చెక్కును అందజేస్తున్న ఎస్పీ ఆర్.గంగాధరరావు

కోనేరుసెంటర్: పోలీసుశాఖలో పనిచేస్తూ మృతి చెందిన పోలీసు కుటుంబాలకు ఎల్లప్పుడూ పోలీసుశాఖ అండగా ఉంటుందని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు. పమిడిముక్కల పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ గత నెల 13వ తేదీన రోడ్డు ప్రమాదంలో మరణించిన ఎం.రామకోటేశ్వరరావు కుటుంబానికి పోలీసుశాఖ తరపున మంజూరైన రూ.50,000 విడోఫండ్‌తో పాటు రూ, 25,000 ఇన్సిడెంటల్ చార్జెస్ చెక్కులను మంగళవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధినిర్వహణలో అంకితభావంతో పనిచేసిన కోటేశ్వరరావు అకాల మరణం బాధిత కుటుంబంతో పాటు పోలీసుశాఖకు తీరనిలోటన్నారు. బాధిత కుటుంబానికి ఇతర ప్రయోజనాలను వీలైనంత త్వరగా అందజేసేందుకు కృషి చేస్తామన్నారు. ఎప్పుడు ఎలాంటి అవసరం వచ్చినా నేరుగా తనను సంప్రదించవచ్చన్నారు.

పిల్లలను విద్యావంతులను చేయండి

ఎంఈఓ బి.త్రిపురసుందరీదేవీ



దుప్పట్లు అందజేస్తున్న ఎంఈఓ తదితరులు

బంటుమిల్లి: మండల పరిధిలోని పెందుర్రు గ్రామంలో ఎస్టీ యానాది కుటుంబాలకు మంగళవారం ఉపాధ్యాయులు దుప్పట్లు పంపిణీ చేశారు. ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ పెడన నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో సరఫరా చేసిన దుప్పట్లను ఎంఈఓ బి.త్రిపురసుందరీదేవీ యానాది కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు, పాఠశాలలకు పంపి విద్యావంతులను చేసి ప్రభుత్వ సాయం ఉపయోగించుకోవాలన్నారు. మాకు నేటికీ ఆధార్, రేషన్ కార్డులు లేవని, ఎన్ని సార్లు మండల, జిల్లా అధికారులతో మొరపెట్టుకున్నా న్యాయం జరగలేదంటూ యానాది కుటుంబాలవారు ఎంఈఓ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆమె మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. హెచ్‌ఎం సుబ్రహ్మణ్యేశ్వరరావు, జేటీకే ప్రసాదు, టి.మోహన్‌రావు పాల్గొన్నారు.

పెరటి తోటల పెంపకంపై అవగాహన



రావివారిపాలెం ప్రాథమిక పాఠశాలలో పెరటి తోటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

రావివారిపాలెం(మోపిదేవి): ప్రతి పాఠశాలలో పెరటి తోటల పెంపకం చేపట్టి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కేవీకే ఘంటశాల ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి తెలిపారు. మండలంలోని మోపిదేవి జెడ్పీ ఉన్నత పాఠశాల, రావివారిపాలెం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం పెరటి తోటల పెంపకంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ గృహాలలో పెంచిన ఆకుకూరాలు, కూరగాయలనే ఆహారంగా తీసుకోవాలని సూచించారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి.కృష్ణవేణి మాట్లాడుతూ వివిధ కాలాల్లో లభించే ఆకుకూరలు, కూరగాయలను తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. న్యూట్రీ గార్డెన్ కిట్, టమాట, మిరప నారును పంపిణీ చేశారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ వి.మంజువాణి, డాక్టర్ కె.రేవతి, డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి, ఐసీఆర్పీలు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు గుండె జబ్బుల వైద్య శిబిరం

పెడన: పట్టణంలోని శ్రీ వాసవి కల్యాణ మండపంలో ఈ నెల 12న గుండె జబ్బుల వైద్య శిబిరం ఉచితంగా నిర్వహిస్తున్నట్లు పట్టణంలోని హోల్‌సేల్ అండ్ రిటైల్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టరు కొల్లూరి చిన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో విజయవాడకు చెందిన ప్రవీణ్ కార్డియాక్ సెంటర్ డాక్టర్ మద్దిరాల ప్రవీణ్ పాల్గొని వైద్య పరీక్షలు చేస్తారు. నరాల వ్యాధుల పరీక్షలు, ఈసీజీ, 2డీ ఎకో, స్కానింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి, వైద్యులు సూచనలు చేస్తారని చిన్న తెలిపారు. ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.